

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 153 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 30, ఏప్రిల్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




## ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ

భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం

ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోదీ విస్పష్ట ప్రకటన

6

## పారిశ్రామిక అభివృద్ధికి రైల్వే అనుసంధానం ఎంతో అవసరం

ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్

పారిశ్రామిక కారిడార్లలో రైల్వేలైన్ల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో చర్చించిన మంత్రి టి.జి భరత్



6



## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం

భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి

7



## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

కేంద్రం నివేదకను తప్పుపట్టడం దుర్మార్గం


సొంత నిర్ణయాలతో లక్షకోట్లు నీటిపాటుచేశారు

అయినా సిగ్గూఎగ్గు లేకుండా మాట్లాడితే ఎలా

బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

7





# అమరావతికి రెండో సారి శంకుస్థాపన ఎందుకు ?



### మోడీ తీరుపై దేశవ్యాప్తంగా విమర్శలు

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరోసారి శంకుస్థాపనకు సిద్ధమైంది.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దశాబ్దం తరువాత అమరావతికి రెండో సారి శంకుస్థాపన చేస్తున్నారు. దీనికోసం ప్రభుత్వం హై-ప్రొఫైల్లో ఏర్పాట్లు చేసింది. దేశంలోనే అమరావతిని నగరంగా తీర్చిదిద్దుతామని ఒకప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం ప్రచారం చేసింది. అందులో భాగంగా నగర అభివృద్ధికి 65 వేల కోట్ల నిధులను కేటాయించింది. దీంతో అమరావతి వంటి మెగా ప్రాజెక్టులకు అడ్డంకులు ఎందుకు ఎదురవుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మే 2న ప్రధాని మోదీ అమరావతి రాజధాని ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభించనున్నారు. ఈ ఎంపిక కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు హాజరుకానున్నారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయినప్పుడు, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి ఎరాజధానిగా

- మిగతా 5లో..



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

లోటుపాట్లు లేకుండా పక్కాగా భద్రతా చర్యలు

చారిత్రక ప్రాంతల సందర్శనకు ఏర్పాటు చేయండి

అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

2





## శరవేగంగా రాజధాని పర్యటన ఏర్పాట్లు

మరోమారు అధికారులతో పరిశీలించిన నారాయణ

2

# తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

**7వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు నిర్ణయం**

**సమ్మె పోస్టర్ ఆవిష్కరించిన కార్మిక జెఎసి**

**హైదరాబాద్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఉద్యోగుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మే 7వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా సమ్మె సంబంధించిన పోస్టర్ ను ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆవిష్కరించింది. మే డే స్ఫూర్తితో ఆర్టిసి సమ్మెకు సిద్ధం అయ్యింది. ప్రభుత్వం స్పందించి సమస్యల నివారణకు చర్యలు చేపట్టాలని, మా న్యాయమైన డిమాండ్ ల పై స్పందించాలని జేఏసీ నాయకులూ అన్నారు. ఇక సమ్మెకు ముందు ఆర్టిసి కార్మికులు మే 5 న కార్మిక కవాతు చేపడుతున్నామని, ఆర్టీసీ కళ్యాణ మండపం నుండి బస్సు భవన్ వరకు సమ్మెకు మద్దతుగా ఆర్టీసీ యూనిఫారంలో కవాతు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఇకపోతే, కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జేఏసీలోకి వస్తామని, మళ్లీ యాజమాన్యాలకు మద్దతుగా మాతో కలవడం లేదని.. యూనియన్ లకు అతీతంగా అందరూ సమ్మెకు కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఆర్టీసీ విలీనాన్ని సీఎం చేపట్టాలని, ప్రజాపాలన చేయాలని కోరుతున్నట్లు- వారు పేర్కొన్నారు. ప్రైవేటీకరణ మూలమైన ఎలక్ట్రిక్ బస్సు లను ఆర్టీసీ యాజమాన్యం కొని నడపాలని, 2021 వేతన సవరణ చేపట్టాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టిసి కార్మికులకు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. 16 వేల మంది రిటైర్ అయిన ఖాళీలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేసారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

**లోటుపాట్లు లేకుండా పక్కాగా భద్రతా చర్యలు**
**చారిత్రక ప్రాంతల సందర్శనకు ఏర్పాటు చేయండి**
**అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

మిస్ వరల్డ్ పోటీలను అ÷-యతంత కట్టుదిట్టమైన భద్రతమధ్య నిర్వహించాలని, ఎక్కడా లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులనురేవంత్ రెడ్డి ఆదేశించారు. అందులోభాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ పోటీలకు వచ్చే అతిథులు .. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేయాలన్న సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.దేశ,విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీ-ల్లో



పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీ-లు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభవన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు- చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఈ నెల 29న అంకురార్పణ

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో స్వయం వ్యక్తమై దర్శింపవచ్చిన భక్తుల పాలిట కోరిన కోర్కెలకు కొంగు బంగారమగుచూ పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో ఈ నెల 29 నుండి మే 10 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహింపబడే శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఈ నెల 29 మంగళవారం అంకురార్పణ జరిగింది. ఉదయం గం. 4-00లకు అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన పిమ్మట ఆలయ అర్చకులు అమ్మవారికి ఉత్సవాంగీకార ప్రార్థన జరిపారు. అనుజ్ఞ లభించిన వెంటనే అమ్మవారికి బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. మంగళవారం కార్యక్రమంలో భాగంగా ముందుగా గణపతి పూజ, పుణ్యహవాచనం, నాంది, ఇడాహవాచనం, బ్రహ్మకూర్చహెరీమం, పంచగవ్య ప్రాశన, బుత్విగ్వరణం, మధుపర్కవిధి జరిపి వాస్తుయాగం, పర్యగ్నికరణం, మృత్సంగ్రహణం, ధ్వజాధివాస కార్యక్రమాలు నిర్వహించి ఉదయం గణపతి సేవను, సాయంకాలం శ్రీ సుబ్రహ్మణ్య సేవ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిపారు. ఈ బ్రహ్మోత్సవాలను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ప్రతిసరబంధం, ఉదకశాంతి నిర్వహించి రక్షోఘ్న హెరీమం అనంతరం బ్రహ్మోత్సవ అంకురార్పణ జరిపి సాయంతన పూజ నిర్వహించడంతో ఈ రోజు కార్యక్రమం పూర్తయింది. మంగళవారం అంకురార్పణ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు వందలాదిగా వరంగల్ జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య నేతృత్వంలో మేళతాళాలతో పట్టుచీరలు, పూజాద్రవ్యాలు అమ్మవారికి సమర్పించి పూజాదికములు నిర్వహింపజేశారు. బ్రహ్మోత్సవాల ధ్వజారోహణకు ధ్వజపటాన్ని అత్యంత సుందరంగా తయారు చేసి ఇచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి గంద్రాతి వర్షన్ను ఆలయానికి విచ్చేసిన భక్తులు అభినందించారు. ఆలయ ఉత్సవ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మానసిక, శారీరక రోగాలు తొలగిపోతాయని ధ్వజారోహణ సందర్భంలో నివేదించిన ప్రసాదాన్ని భుజించడం వల్ల గర్భదోషాలు తొలగిపోయి సంతానవంతులౌతారని ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. మంగళవారం రోజున కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం ప్రముఖులలో మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు గైనేని రాజన్, జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య, గౌరవ సలహాదారు ఈవి. శ్రీనివాస్, తోట వెంకటన్న, కనుకుంట్ల రవికుమార్, బక్కి రాజ్కుమార్, కందుల సుజనీకాంత్, పాటి శ్రీనివాస్, శ్రీధర్, వొడితెల రాము, సత్యనారాయణ, మాడిశెట్టి వరుణ్, చందు, సతీష్, కుమారస్వామి, ప్రకాష్, కనుక రాములు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు, పెండాల్స్, చల్లటి త్రాగునీరు, ఉచిత ప్రసాద వితరణ తదితర ఏర్పాటు దేవాలయ కార్యనిర్వహనాధికారి, అసిస్టెంట్ కమీషనర్ శేషుభారతి చేశారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రేపు ఉదయం గం।। 11-00లకు ధ్వజారోహణ కార్యక్రమంతో 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయని యావన్మంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.



# తోణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

**ఆదివాసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించొద్దు**
**మంత్రి సీతక్క వెల్లడి**

**వరంగల్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు.మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు. అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటు-న్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ-బృందం కలిసింది. కాగా.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు- చేస్తున్నట్లు- సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు గత వారం రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. ఆపరేషన్ కర్రెగుట్టలు నిలిపివేయాలని ఓ వైపు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి. అటు- మావోయిస్టులు కూడా ఇప్పటికే మూడు నాలుగు సార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అంతేకాకుండా కర్రెగుట్టలపై బేస్ క్యాంప్‌ను ఏర్పాటు- చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈరోజు ఒక్కరోజే వెంకటాపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి కర్రెగుట్టలపైకి రెండు హెలికాప్టర్లు నాలుగు సార్లు అక్కడకు వెళ్లి బలగాలు, మందుగుండు సామాగ్రిని తరలించాయి. ఇటీ-వల వడదెబ్బ కారణంగా 40 మంది జవాన్లు వెనక్కి వచ్చినప్పటికీ రెట్టింపు సంఖ్యలో బలగాలను చేరవేస్తూ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# తిరుపతి మంగళంలో దారుణం

**భవనంపై నుంచి పడి ముగ్గురు కార్మికుల దుర్మరణం**

**తిరుపతి,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి ప్రమాదవశాత్తూ పడి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతి జిల్లాలో జరిగింది. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ హెచ్ఐజి ఫ్లాట్ నెంబర్ 63 లో 5 అంతస్తుల భవన నిర్మాణం జరుగుతుంది. భవన యజమాని అండాలయ్య జిపిఎస్ జీ ప్లస్ 3 కి అనుమతి తీసుకొని 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఉదయం నలుగురు మేస్త్రీలు భవనం 5వ అంతస్తు గోడకు పూత పని చేయడానికి వేసుకున్న బెడ్ కర్ర విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు కిందికి పడిపోయి మరణించారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ డిఎస్పి, ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తాసిల్దార్ భాగ్యలక్ష్మి, సిఐ సునీల్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చనిపోయిన ముగ్గురు కార్మికులు ఒంగోలుకు చెందిన వసంత్ (40), ఒంగోలు శీను (38), పెళ్ళకూరు మండలం, అక్క గారి పేట గ్రామం కు చెందిన బోటతొట్టి శ్రీనివాసులు (38) గా గుర్తించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి కిందపడిన కార్మికులను పరిశీలించి వారు మృతి చెందినట్లు-గా నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# శరవేగంగా రాజధాని పర్యటన ఏర్పాట్లు

**మరోమారు అధికారులతో పరిశీలించిన నారాయణ**

**అమరావతి,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు శరవేగంగా పూర్తి కావస్తున్నాయి. చంద్రబాబు, మంత్రులు సమీక్షలు చేస్తూ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగేమంత్రుల కమిటీ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో దాదాపు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. మిగిలిన పనులను బుధవారం నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లే ఔట్ రోడ్లు నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే రూ.41 వేలకోట్లకు పనులు ప్రారంభమయ్యాయి. 2019కు ముందు రూ.5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. సోమవారం అమరావతి ప్రాంత రైతులతో సీఎం రెండుగంటలపాటు- మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారని నారాయణ తెలిపారు. అన్నీ సక్రమంగా సాగుతున్నాయి. ఇక రాజధాని నిర్మాణం వేగం పుంజుకుంటుందని మంత్రి అన్నారు.

# ప్రధాని నివాసంలో మరోమారు అత్యున్నత సమావేశం

**హాజరైన రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గతవారంలో 26 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్న ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం తన నివాసంలో అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. పరిస్థితిని సమీక్షించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. త్రివిధ దళాధి పతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది (ఆర్మీ), అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి (నేవీ), అమర్ ప్రీత్ సింగ్ (ఎయిర్‌ఫోర్స్) సైతం హాజరయ్యారు.జాతీయ భద్రతాంశాలపై విధాన నిర్ణయాలు తీసుకునే కేబినెట్ భద్రతా వ్యవహారాల కమిటీ- బుధవారంనాడు కీలక సమావేశం జరుపనుంది. దీనికి ప్రధానమంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఈ కీలక సమావేశానికి ముందుగానే మోదీ నివాసంలో త్రివిధ దళాధిపతులు, అజిత్ దోవల్ తదితరులు మంగళవారం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై ప్రధానమంత్రికి సోమవారంనాడు సుమారు 40 నిమిషాల పాటు- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధానమంత్రికి వివరించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీసుకుంటు-న్న చర్యలు, భద్రతపై సమీక్షించేందుకు హోం మంత్రిత్వ శాఖకార్యాలయంలో మంగళవారం సాయంత్రం అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు.

# గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

**ఇద్దరు నర్సింగ్ విద్యార్థుల దుర్మరణం**

**గద్వాల,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్) :**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది. జిల్లా కేంద్రంలో నర్సింగ్ విద్యార్థులను బోలేరా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఐదుగురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడని వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. నర్సింగ్ కాలేజ్ నుంచి హాస్టల్ కు వెళ్లే క్రమంలో బస్ పాయింట్ దగ్గర ఆగినప్పుడు ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గద్వాల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థిణులు మృతి చెందడం పట్ల ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న అమ్మాయిలు, చిన్న వయసులోనే ఇలా మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, మృతుల కుటుంబాలకు అండగా ఉండాలని వారికి సూచించారు. ఇదే ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మరో విద్యార్థినికి అవసరమైన వైద్య సాయం అందించాలని కలెక్టర్‌ను, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతి ప్రకటించారు. మరణించిన విద్యార్థిణుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# పర్యాటకరంగంలో బలమైనపునాది వేశా

**మరోమారు ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్**

**హైదరాబాద్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్) :**

ఇటీవల బదిలీ వేటుకు గురైన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్ట్ చేశారు. భగవద్గీతలోని 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' శ్లోకంతో ప్రారంభించి.. 'పర్యాటకంలో 4 నెలలు పనిచేశా. నా వంతు కృషి చేశాను!. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 25-30 పర్యాటక విధానాన్ని తీసుకువచ్చాను. ఇది రాష్ట్రానికి మొదటిసారి. నిర్లక్ష్యం చేయబడిన పర్యాటక ప్రాంతాలకు దిశను చూపేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ఒక బలమైన పునాదిని సృష్టిస్తుంది. పర్యాటక శాఖ పని శైలిని పునరుద్ధరించాను. జవాబుదారీతనాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నించాను. లాజిస్టిక్స్ అండ్ ప్రణాళికకు పునాది వేశాను. ప్రపంచవ్యాప్త కార్యక్రమం కోసం.. ఇది ఖచ్చితంగా మరిన్నింటికి తలుపులు తెరుస్తుంది' అని స్మితా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాగా, ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్ పై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు- వేసింది. ఆమెను ఫైనాన్స్ కమిషన్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

## ఎస్‌జిఎఫ్ బాక్సింగ్ జాతీయ స్థాయి (బాలికల) పోటీలకు జనగామ జిల్లా విద్యార్థిని తాటికాయల చరిష్మ ఎంపిక

**జై భీమ్ న్యూస్ (వరంగల్)**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ( ఎస్జిఎఫ్ ) బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీలకి తెలంగాణ రాష్ట్రము నుండి జనగామ జిల్లా జఫర్ గడ్ మండలం హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన తాటికాయల చరిష్మ ఎంపికయ్యారు అని తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ ఆర్గనైజర్ సెక్రటరీ శీలం పార్థసారధి తెలిపారు.ఈ నెల 30 నుండి మే 5 వరకు న్యూఢిల్లీలో ఛత్రసల్ స్టేడియం లో 68 వ (ఎస్జిఎఫ్ ) జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలో పాల్గొంటారని అన్నారు.ఎంపిక అయినా విద్యార్థి చదువుతున్నా పాఠశాల మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.ఉమా మహేశ్వరీ ఫీజికల్ డైరెక్టర్ పద్మ పి.ఈ.టి సరిత మరియు పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.గత రెండు సంవత్సరాలనుండి హైదరాబాద్‌లో టిజి ఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాల బాక్సింగ్ అకాడమీ లో మాజీ అంతర్జాతీయ బాక్సర్ అయినా కృష్ణ తాప దగ్గర శిక్షణ తీసుకునట్లు చరిష్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల పి.ఈ. టి కోచ్ లు రమేష్ శాంసన్ తదితరులు అభినందనలు తెలిపారు.

## దాసరి శ్రీనివాసరావు, ప్రసన్న జ్ఞాపకార్థంగా ఉచిత మజ్జిగ పంపిణీ..




**కె.పి.హెచ్.బి, జిల్లా జై భీమ్ న్యూస్**

దాసరి శ్రీనివాసరావు, ప్రసన్న జ్ఞాపకార్థంగా, కె.పి.హెచ్.బి లోని భాగ్యనగర్ కాలనీలో రాహుల్ దాసరి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోల్డ్ మాన్‌గా కొండా విజయ్ ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విజయ్ మాట్లాడుతూ, వేసవి తీవ్రత నుండి ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ చేయడం అనేది అభినందనీయమని, రాహుల్ దాసరి టీంకు తెలిపారు. మరెన్నో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని వారిని ప్రోత్సహించారు. ఈ వేసవి కాలం మొత్తం పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాసాగర్, శ్రీనివాస్ యాదవ్, హరికుమార్, హరికృష్ణ, సతీష్ నాయుడు, బుల్లెట్ రవి, రవీందర్, రాకేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీకి యువతే బలం

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించాలి**
**జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ బాను చిబ్ ఆత్మకూర్**

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి యువతే కీలక పాత్ర పోషించిందని ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా అర్హులైన పేదలకు అందించే బాధ్యత యువత పైన ఉందని జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ అన్నారు. మంగళవారం హైదరాబాదులోని ఎల్బీనగర్లో రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ అధ్యక్షత జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మీటింగ్ కి ముఖ్య అతిథులుగా జాతీయ ఇన్చార్జి కృష్ణ అల్లవార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,రాష్ట్ర స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ శివసేన రెడ్డి,రాష్ట్ర ఇంచార్జి ఖలీద్ హాజరై యువత ఈ విధంగా పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్,ఇంచార్జు పడాల రాహుల్, అశ్విన్ రాథోడ్ సూచలతో పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ నాయకత్వంలో నియోజకవర్గ యూత్ కమిటీ సభ్యులు భారీగా తరిలి వెళ్లారు. మేరకు తెలంగాణ యూత్ కాంగ్రెస్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగులో జాతీయ అధ్యక్షులు ఉదయ్ బాను చిబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేదకు చేరవేయాలి అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ కాంగ్రెస్ పథకాలను అందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి యూత్ కాంగ్రెస్ బలమని, వారి పాత్రే కీలకమన్నారు.రాబోయే భవిష్యత్తు యూత్ కాంగ్రెస్ దేనని యూత్ కాంగ్రెస్ ప్రతి నాయకులు, కార్యకర్తలు వీర సైనికుల్లా పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన దాడులు, దౌర్జన్యాలను, అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ ప్రజలకు అండగా నిలిచి అన్ని విధాల ఆదుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మంద శ్యామ్, సింగారపు రాజేష్,నియోజకవర్గ ప్రధానకార్యదర్శి అల్లం శ్రీరామ్, ఉపాధ్యక్షులు పిట్టల అనిల్,వల్లెం సాయి,మండలాల అధ్యక్షులు రమేష్ నాయక్,తనుగుల సందీప్,అప్పం కుమారస్వామి, దొమ్మటి కృష్ణకాంత్,మండల ఉపాధ్యక్షులు కొక్కరకొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# అన్ని మతాలను గౌరవించుకోవడం అభినందనీయం

**అంపశయ్య నవీన్**
**వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీకి భాసటగా ఉంటాం- పలువురు వక్తలు**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

మన పండుగలు పేరుతో అన్ని మతాలను గౌరవించుకోవడం అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు.మంగళవారం హనుమకొండ నయీంనగర్ లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్ లో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మత సామరస్యానికి ప్రతీకగా మన పండుగలు పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి సొసైటీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఆచార్య బి సురేష్ లాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా శాంతి పతకాన్ని ఆవిష్కరించి,శాంతి గీతం ఆలపించి, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యకమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇటీవల మరణించిన భారతదేశ ప్రముఖులతో పాటు ఇటీవల ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు ప్రకటించి మౌనం పాటించారు. అధ్యక్షోపన్యాసం చేసిన సురేష్ లాల్ మాట్లాడుతూ ఉగాది,రంజాన్, శ్రీరామనవమి, అంబేద్కర్ జయంతి, ఈద్ మీలాప్,గుడ్ ఫ్రైడే, ఈస్టర్, గురు నానక్ జయంతి తదితర పండుగులను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సొసైటీ ఆధ్వర్యంలో సర్వ మత సమ్మేళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.శాంతి స్థాపనే సొసైటీ లక్ష్యం అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ వరల్డ్ పీస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని మతాలను గౌరవించుకుంటూ సర్వమత సమ్మేళనం నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ప్రస్తుత సమాజంలో ఎవరికి వారుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటుండగా, వరల్డ్ పీస్ బాధ్యులు మాత్రం భిన్న సంస్కృతులను ఒక దగ్గరికి చేర్చి కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. రాబోయే కాలంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ వారు చేపట్టే కార్యక్రమాలకు భాసటగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా భిన్న మతాలకు చెందిన ఐదుగురికి శాంతి మిత్ర పేరుతో అవార్డులు ప్రధానం చేసారు.సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు అంశాలలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విజేతలుగా నిలిచిన 12 మంది విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేసారు. అనంతరం భిన్న మతాల మేలవింపుతో కూడిన వరల్డ్ పీస్ ఫుడ్ ఫెస్టివల్ పేరుతో వంటకాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు మొహమ్మద్




సిరాజుద్దీన్, శ్రీపాద సుధాకర్ రావు, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ఆచార్య కొక్కొండ విజయబాబు, కాజీపేట పురుషోత్తం,కుజ విజయ్ కుమార్, నిమ్మల శ్రీనివాస్, ఆచార్య వెలుదండి రవికుమార్, మండల పరుశరాములు, పొన్నాల సంయుక్త, పగడాల సరళ,ప్రగళ్లపాటి రాజ్ కుమార్, పొన్నాల రామ్మోహన్, ఘంటా రామిరెడ్డి, సాగంటి మంజుల, డాక్టర్ కె అనితా రెడ్డి, వల్లపురెడ్డి దయాకర్ రెడ్డి, డాక్టర్ టి వీ రమణాకర్, బిటవరపు శ్రీమన్నారాయణ, శనిగరపు రాజ మోహన్,రెహమాన్ తో పాటు సుమారు 200 మంది కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

# జైలు నుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలి






**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

దొంగతనాలను కట్టడి చేసేందుకు చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలునుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలని కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. మార్చ్ నెల సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ పిలిపించడం కాకుండా, అధికారులు రౌడీ షీటర్లను వ్యక్తిగతం కలుసుకోవడం లేదా పరిసరాల్లో వుండే వారి నుండి రౌడీ షీటర్ ప్రస్తుత స్థితిగతులను అరా తీయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో సిసి కెమెరాలు కీలకంగా నిలుస్తున్నాని, ఇందుకు గాను పోలీస్ స్టేషన్ పరిధిలో కెమెరా పనితీరుపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, కొత్త సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, పోలీస్ స్టేషన్ ల్లో పని చేసే మహిళా సిబ్బందితో అన్ని రకాల విధుల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించడంతోపాటు మహిళా సిబ్బందిలో స్టేషన్ అధికారులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని. జాతీయస్థాయిలో గుర్తింపు, అవార్డులు తీసుకొచ్చే విధంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని, రేయి పగలు ప్రజల కోసం పనిచేయాల్సి ఉంటుందని పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చే పోలీసు అధికారులకు రివార్డులు అవార్డులు ఉంటాయని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, జనార్ధన్, జనగాం ఏఎస్పీ చైతన్య, ఏ.ఎస్పీ మనాన్‌భట్, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గోన్నారు.

# యజమాని అని అంటూ మేసేజ్ చేసి కోట్లు కొట్టెసిన సైబర్ నేరస్థుడి అరెస్టు

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

యజమాని పేరుతో మేసేజ్ చేసి కోట్లు కొట్టెసిన సైబర్ నేరస్థుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కు చెందిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ సెక్యూరిటీ పోలీసులు గత రాత్రి అరెస్టు చేసారు. నిందితుడి నుండి పోలీసులు రెండు సెల్ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ డి.ఎస్పీ సి.హెచ్. ఆర్.వి. ఫణీందర్ వివరాలను వెల్లడిస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, ప్రతాప్ ఘడ్ జిల్లాకు చెందిన నిందితుడు ప్రదీప్ కుమార్ (39) హన్మకొండ పట్టణంలోని ప్రముఖ హచరీస్ సంస్థలో పనిచేస్తున్న గుమాస్తాకు గత నెల 19వ తేదిన ఒక గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుండి నేను మీ యజమానిని ఇది నా కొత్త ఫోన్ నంబర్ అని ఈ నంబర్ సేవ్ చేసుకోమ్మని సదరు సంస్థ గుమాస్తా వాట్సప్ మేసేజ్ పంపియడంతో తన యజమాని నంబర్ భ్రమ పడిన సంస్థ గుమాస్తా మేసేజ్లోని నంబర్ను తన ఫోన్లో సేవ్ చేసుకున్నాడు. మరుసటి రోజున గుమాస్తా తాను సేవ్ చేసుకున్న నంబర్కు ఫోన్ చేయగా నేను మీటింగ్లో వున్నాను తరువాత చేస్తాను అని సైబర్ నేరగాడు సమాధానం ఇస్తాడు. అనంతరం మరుసటి రోజున గుమాస్తా సేవ్ చేసుకున్న నంబర్ నుండి నిందితుడు చేయడంతో తన యజమాని ఫోన్ చేస్తున్నాడు అనుకొని ఫోన్ లిఫ్ట్ చేయడంతో, ఎక్కడ వున్నావు అని అడిగి తన బ్యాంక్ లావాదేవీలను తదితర వివరాలను అడిగి తెలుసుకోని, ప్రస్తుతం వున్న బ్యాంక్ బ్యాలెన్స్ నుండి తను చెప్పిన ఆకౌంట్కు డబ్బును ట్రాన్స్ఫర్ చేయమనడంతో ఫోన్లో మాట్లాడేది తన యజమానిగా భావించిన సదరు సంస్థ గుమాస్త నిందితుడు చెప్పిన బ్యాంక్ అకౌంట్కు రెండు దఫాలుగా మొత్తం ఒక కోటి 68లక్షల రూపాయలను బదిలీ చేశాడు. మరోమారు నిందితుడు ఫోన్ చేయడంతో నిందితుడి మాటతీరును తప్పుపట్టి గుమాస్త అనుమానంతో తన సంస్థ యజమానికి సంబంధించిన వ్యక్తిగత నంబరు ఫోన్ చేయడంతో అసలు విషయం బయటపడటంతో కంగుతిన్న సంస్థ యజమాని, గుమాస్తా తాము సైబర్ నేరగాడి చేతి మోసపోయినట్లుగా గుర్తించి వెంటనే వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ విభాగంలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రస్తుతం పోలీసుల వద్ద వున్న టెక్నాలజీ వినియోగించుకోని సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాడిని అరెస్టు రిమాండ్కు తరలించారు. నిందితుడి పట్టుకోవడంలో శ్రమించిన సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ యాసిన్, ఎస్.ఐలు చరణ్, శివ, కానిస్టేబుళ్ళు శివ, జహూర్ ను డి.ఎస్పీ అభినందించారు.



# ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు

**ముగ్గురు కార్మికుల దుర్మరణం**

**యాదాద్రి భువనగిరి,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద ఉన్న ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది.పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకొని అక్కడకు చేరుకొని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మోటకొండూరు మండలంలోని ప్రీమియర్ ఎక్స్ ఎ÷-లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది. పేలుడు ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు గాయపడ్డారు. మరో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు.. ఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద ఇద్దరి మృతదేహాలు ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జేసీబీ సహాయంతో శిథిలాల్లో చిక్కుకున్న వారికోసం గాలింపు చేపట్టారు. కార్మికుల మృతితో గ్రామస్తులు కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

# అమరావతికి రెండోసారి శంకుస్థాపన ఎందుకు?

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌ను వదిలిపెట్టారు. మిగిలిన రాష్ట్రానికి కొత్త రాజధాని కోసం కృష్ణా నది ఒడ్డున ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన అమరావతి ప్రాంతాన్ని ఎంపిక చేశారు. 2015 అక్టోబర్ 22న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అట్టహాసంగా అమరావతికి శంకుస్థాపన చేశారు. అప్పుడు దేశ విదేశాల నుంచి ప్రముఖులు. అభివృద్ధి చెందిన సింగపూర్ ఆదర్శంగా అక్కడి నగరాలకు ధీటుగా అమరావతిని నిర్మించాలనే స్ఫూర్తితో, పనులకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అయితే, తరువాత టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ ప్రాజెక్ట్‌కు బ్రేకులు పడ్డాయి.

**అమరావతి ప్రారంభోత్సవం..**

**రెండవసారి శంకుస్థాపనలు మోడీకి కొత్తేమికాదు..**

అమరావతికే ప్రధాని మోడీ రెండవసారి శంకుస్థాపన చేస్తున్నారంటే పొరబాటే, ఇలాంటి శంకుస్థాపనలు దేశంలో మోడీ చేతులు మీదుగా పదేపదే ఇతర ప్రధాన ప్రాజెక్టుల విషయంలోనూ జరిగాయి. 2015లో ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోని తూర్పు ఎక్స్‌ప్రెస్‌వేను మొదట శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నిర్మాణ జాప్యాలు, భూసేకరణ సమస్యల కారణంగా 2017లో మళ్లీ మళ్లీ అదే ప్రాజెక్ట్‌కు మోడీ శంకుస్థాపన చేశారు. చివరకు ఈ ప్రాజెక్ట్ 2018లో పూర్తి చేసి ప్రారంభించబడింది. 2020లో ప్రారంభించబడిన ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రెండు సార్లు శంకుస్థాపనలు చేయబడ్డాయి. 2021లో మొదట ప్రారంభించబడిన సూరత్ మెట్రో ప్రాజెక్ట్‌కు 2023లో తిరిగి పునాదిరాయి వేయబడింది. ఇప్పుడు దానిని 2027కు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇదీకాక 2017లో ప్రారంభమైన గుజరాత్‌లోని సుదర్శన్ సేతు వంతెన, సుదీర్ఘ కాలం తర్వాత 2024లో మళ్లీ చిత్రం. 2018లో శంకుస్థాపన చేసిన ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్ కూడా 2023లో పాక్షికంగా మాత్రమే పూర్తయింది. ఇలా పలు ప్రాజెక్టులకు మోడీ పదేపదే శంకుస్థాపనలు చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే, ఇప్పుడు అమరావతి రాజధాని ప్రాజెక్టు పనులు మరోసారి పునఃప్రారంభం కాన తాజా, ఈసారైనా ఈ ప్రాజెక్ట్ పూర్తిచేస్తారా, లేదా? కేవలం పునాది రాళ్లు వేసి మమా అనిపిస్తారా అనేది చూడాలి.

**రాజధాని ప్రాజెక్టుపై వివాదాలు..**

అమరావతి అభివృద్ధి మొదటి దశలో, ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని అనేక ఆరోపణలు వచ్చాయి. రాజధాని ప్రాంతానికి సంబంధించి అధికారిక ప్రకటనకు ముందే కొత్త రాజధాని ఎక్కడ ఏర్పాటు అవుతుందో అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, మంత్రులకు కూడా సమాచారం అందిందని ఆరోపణలు వచ్చాయి. దాంతో అమరావతి దగ్గరలో తక్కువ ధరలకు పెద్ద ఎత్తున వ్యవసాయ భూములను కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత రాజధాని అమరావతిలో భూసేకరణకు సంబంధించిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ వివాదంలో చిక్కుకుంది. రాజధాని అధికారికంగా ప్రకటించిన తర్వాత భూ ధరలు విపరీతంగా పెరిగిన భూములలో ముందస్తు పెట్టుబడుల ద్వారా చంద్రబాబు నాయుడు కుటుంబం, సన్నిహితులు ప్రయోజనం పొంది ఉండవచ్చనే కోణంలో పలు సంస్థల దర్యాప్తులు కొనసాగాయి. చంద్రబాబు కుమారుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా రాజధాని అధికారిక ప్రకటనకు ముందే కీలక ప్రాంతాలలో భూమిని కొనుగోలు చేశారనే ఆరోపణలను ఎదుర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొన్న వారిలో, పార్టీ సీనియర్లు అప్పటి మంత్రులు, తదితరులు కూడా ఉన్నారు. ఈ కుంభకోణ ఆరోపణలతో అమరావతి అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే భూసేకరణ ప్రక్రియలో అవకతవకలను పేర్కొంటూ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును నిలిపివేయడానికి దారితీసింది.

**తెరపైకి మూడు రాజధానుల నినాదం..**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అమరావతిని రాజధానిని సమర్ధించారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత, జగన్ రెడ్డి ప్రభుత్వం నాటకీయంగా మాటమార్చి రాష్ట్రానికి మూడు రాజధానులు ఉండాలనే కొత్త నినాదం అందుకున్నారు. జగన్ ప్రభుత్వం ప్రకటించిన మూడు రాజధానుల ఫార్ములా ప్రకారం విశాఖపట్నంను కార్యనిర్వాహక రాజధానిగా, అమరావతిని శాసనసభ రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా పేర్కొంది. అయితే, అప్పటి ప్రభుత్వం కేవలం అమరావతిలో అభివృద్ధిని కేంద్రీకరించడం వల్ల ప్రాంతీయ అసమతుల్యతలు తీవ్రమవుతాయని వాదనను తెరపైకి తీసుకొచ్చింది. అమరావతిని రాజధానిగా కొనసాగించడానికి అప్పటి జగన్ ప్రభుత్వం ఆర్థిక పరిమితులు, పరిష్కారం కాని భూవివాదాలు కారణంగా చూపింది. వైసీపీ ప్రభుత్వ నిర్ణయం తీవ్రవ్యతిరేకతను మూటగట్టుకుంది. ముఖ్యంగా రాజధాని కోసం తమ భూములను అప్పగించిన అమరావతి రైతుల నుంచి భారీ నిరసనలు, చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. దీంతో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మూడు రాజధానుల ప్రతిపాదనను కొట్టివేసి, అమరావతిని ఏకైక రాజధానిగా ఉంచాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ తీర్పు జగన్ రెడ్డి పరిపాలనకు రాజకీయంగా గణనీయమైన ఎదురుదెబ్బగా నిలిచింది.

**మూడు పంటలపై వివాదాలు..**

అమరావతి విమానాశ్రయం,ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం కొత్తగా భూసేకరణ చేయడం వల్ల సారవంతమైన వ్యవసాయ భూమి మరింత నాశనం కావచ్చు ఈ ప్రాజెక్ట్‌ను చుట్టుముట్టాయి. నివేదికల ప్రకారం ఈ ప్రాంతంలోని 10,000 ఎకరాలకు పైగా భూమి ప్రధానంగా వరి, వేరుశనగ , చెరకు వంటి పంటలను పండించడానికి బాగా ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఆ భూమి పట్టణ ప్రాంతంగా మారితే ఈ నష్టం ఆహార భద్రత ,స్థానిక వ్యవసాయ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక వాదం చూపుతుందన్న చిత్రం తెరపైకి వచ్చాయ్. వ్యవసాయ ఉత్పాదకతకు ప్రసిద్ధి చెందిన అమరావతి చుట్టూ ఉన్న సారవంతమైన భూములు ఏటా మూడు నుంచి నాలుగు పంటలకు అనుకూలంగా ఉంటాయి. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ ఆహార సరఫరాలో కీలక భూమిక పోషిస్తుంది. ఇక్కడి రైతులు వారి(సంవత్సరానికి 2 మిలియన్ మెట్రిక్ టన్నులు), వేరుశనగ(500,000 మెట్రిక్ టన్నులకు పైగా), చెరకు(300,000 మెట్రిక్ టన్నులు)పండిస్తారు. వీటితో పాటు ఏటా 1,000 కోట్ల విలువైన కూరగాయలు, పండ్లు పండిస్తారు. అయితే, అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలనే రాష్ట్ర పంతం పంట ఉత్పత్తిలో ప్రభుత్వ తగ్గుదలకి దారితీస్తోంది. స్థానిక జీవనోపాధి ప్రాంతీయ ఆహార భద్రత ప్రమాదంలోకి పడేస్తాయ'నే వాదనలు ఈ ప్రాజెక్ట్‌కు ప్రతిబంధకాలుగా ఉన్నాయి.

**అమరావతికి పెద్ద ఎదురుదెబ్బ..**

ప్రపంచ బ్యాంకు 2019లో తన ప్రతిపాదిత 300 మిలియన్ డాలర్ల నిధులను ఉపసంహరించుకోవడం, అమరావతి రాజధాని ప్రాజెక్టును పూర్తిగా దెబ్బతీసింది. "అమరావతి సస్టైనబుల్ క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్" కింద అమరావతికి మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వడానికి ప్రపంచ బ్యాంక్ మొదట అంగీకరించింది. అయితే, భూసేకరణ ప్రక్రియలలో అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు, రైతు సంఘాలు లేవనెత్తిన ఆందోళనలు, ప్రపంచ బ్యాంకులకు అందిన ఫిర్యాదులు నిధుల ఉపసంహరణకు దారితీశాయి. పర్యావరణం, సామాజిక ఆందోళనలను మరింత వివరంగా సమీక్షించాల్సిన అవసరాన్ని ప్రపంచ బ్యాంకు ఉదహరించింది. చివరికి ప్రాజెక్ట్ నుంచి వైదొలగాలని నిర్ణయించింది. ఈ పరిణామం నిధుల కొరతకు కారణమవ్వడమే కాకుండా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కూడా దెబ్బతీసింది. అయితే మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే 800 మిలియన్ల డాలర్ల నిధులు అందించడానికి ప్రపంచ బ్యాంక్ ఎగ్జ్ క్యూటీవ్ బోర్డు ఆమోదం జారీ.

**విమానాశ్రయ విస్తరణకు మరో 40 వేల ఎకరాలు?**

ఇదిలా ఉంటే తాజాగా అమరావతి సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం రాష్ట్రం అదనంగా 40,000 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదించింది. ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ హబ్గా మార్చడమే తమ లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పథకం(%ూూూ%)ద్వారా రైతుల నుంచి 33,000 ఎకరాలు సేకరించింది. ఈ కొత్త భూసేకరణకు ప్రభుత్వం "పారదర్శక పరిహారం" హామీ ఇస్తున్నప్పటికీ, ఈ ప్రణాళిక వ్యవసాయ భూమి మార్పిడిపై ఆందోళనలను మళ్లీ రేకెత్తించింది. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

**2015లో శంకుస్థాపన వేడుకకు భారీ ఖర్చు..**

2015లో అమరావతి శంకుస్థాపన కార్యక్రమం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకకు దాదాపు 9 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. ఇందులో లాజిస్టిక్స్, ఆతిథ్యం, ??భద్రత, రవాణా ఉన్నాయి. అయితే, నిజమైన ఖర్చు 400 కోట్ల రూపాయల వరకూ ఉందని ప్రజల సొమ్ము దుబారా అని అప్పటి ప్రతిపక్ష వైసీపీ ఆరోపించింది. ఇదిలా ఉంటే తాజాగా మోడీ టూర్ కోసం వీఐపీ రూట్‌లో లైటింగ్ కోసమే ప్రభుత్వం దాదాపు 2 కోట్లకు పైగా ఖర్చు చేస్తుండడం ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశమైంది. దీనితో పాటు అమరావతి త్రీడీ డిజైన్ కోసం మరో 80 లక్షలకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. వీటితోపాటు ఇతర ఏర్పాట్లు కలుపుకుని ఈ ఖర్చులు భారీగానే ఉంటాయనే ఆరోణలు వస్తున్నాయి.

**కీలకంగా రాజధాని పనుల పునఃప్రారంభం..**

కొత్తగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలిచిపోయిన అమరావతి రాజధాని ప్రాజెక్టు పునరుద్ధరణను ప్రతిష్టాత్మకంగా ఇప్పుడు మళ్లీ ప్రారంభిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం 65,000 కోట్ల పెట్టుబడి ప్యాకేజీని ఆమోదించింది. 2026 నాటికి రోడ్లు, మౌళిక వసతులు, ప్రభుత్వ సముదాయాలు పట్టణ సౌకర్యాలతో సహా కీలకమైన మౌలిక సదుపాయాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ప్రభుత్వం మూడు రాజధానుల విధానాలలో సంవత్సరాల తరబడి జాప్యం జరిపిన తర్వాత మళ్లి రాజధాని పనులు జోరందుకున్నాయి. ప్రభుత్వం తక్షణ పనుల కోసం 11,467 కోట్లు కేటాయించింది. అభివృద్ధిని వేగవంతం చేయడానికి అంతర్జాతీయ భాగస్వామ్యాలతో ఒప్పందాలు కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. తమ హయాంలో రాజధాని అమరావతి దేశంలో ఇతర ప్రధాన నగరాలకు ధీటుగా రూపొందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తూ కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతున్నారు. ఇందులో భాగంగానే రెండో సారి అమరావతి శంకుస్థాపనకు ప్రధాని మోదీ వస్తున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# పహల్గాం దాడిపై పార్లమెంటులో చర్చిద్దాం

**సభలను అత్యవసరంగా సమావేశ పర్చండి**
**ప్రాని మోడీకి కాంగ్రెస్ అగ్రనేతల లేఖ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్) :**

జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం ఎల్లప్పుడూ కలిసి నిలబడతామని చూపించాలని లేఖలో రాహుల్ కోరారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భారత పార్లమెంటు సాక్షిగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని లేఖలో తెలిపారు. కాగా.. పహల్గామ్ దాడి జరిగిన వెంటనే తర్వాతి రోజు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం కూడా చేశారు. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తాము మద్దతుగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ- సమావేశం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత జరిగిన అఖిల పక్ష సమావేశానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు- అన్ని పార్టీల నేతలు హాజరయ్యారు. ఆ సమావేశంలో భారత ప్రభుత్వం చేపట్టే చర్యలన్నింటికీ మద్దతుగా ఉంటామని, వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. అయితే ఆ సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకాకపోవడాన్ని మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. టు-వంటి ముఖ్యమైన సమావేశానికి ప్రధాని మోదీ వచ్చి అక్కడ జరిగిన సంఘటనలను వివరించి ఉంటే బాగుండేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ పార్లమెంటు- సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ, ఆప్ నేత సంజయ్ సింగ్ కూడా ఈ దాడి ఘటన భద్రతా లోపాలను చూపిస్తోందని.. ఈ క్రమంలో భద్రతా లోపాలు ఎందుకు జరిగాయి.. వాటిని ఏ విధంగా సరిచేస్తున్నారు అనే దానిపై ప్రధాని మోదీ జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఉగ్రవాదంపై దేశం ఏకమైందని.. ప్రపంచానికి సందేశం ఇవ్వడానికి పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లేఖలో కోరారు. ఉగ్రవాద దాడుల ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి సమిష్టి సంకల్పాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అయితే బైసరన్ లోయ తెరిచిన విషయం తమకు తెలియదని కేంద్రం తెలిపింది. ఇది కచ్చితంగా భద్రతా వైఫల్యమేనని ఎంపీ సుప్రియా సూలే పేర్కొన్నారు.

## నేడు విజయవాడకు సిఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బుధవారం విజయవాడ వెళ్లనున్నారు.. బెజవాడలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు వివాహానికి హాజరు కాబోతున్నారు రేవంత్ రెడ్డి.. ఇక, విజయవాడ పర్యటన కోసం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు.. ఉదయం 10.40 గంటలకు కానూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుంటారు.. ఉదయం 10.50 గంటల నుండి 11.30 గంటల వరకు అయన కల్యాణ మండపం నందు.. దేవినేని ఉమా కుమారుడు వివాహానికి హాజరై.. వధూవరులను ఆశీర్వదించనున్నారు.. విజయవాడ నుంచి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు సీఎం రేవంత్ రెడ్డి.. కాగా, గత వారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. తన కుమారుడు వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సీఎంకు అందించి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు.. మరోవైపు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో పనిచేసిన రేవంత్ రెడ్డి.. దేవినేని ఉమాతో సన్నిహితంగా ఉండేవారు.. ఆ తర్వాత పార్టీ మారి.. తెలంగాణ సీఎం అయినా.. వారి మధ్య స్నేహ బంధం కొనసాగుతోంది.. దీంతో, మిత్రుడి ఆహ్వానం మేరకు ఆయన కుమారుడి వివాహానికి హాజరుకాబోతున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి..

## సీఎంను కలిసిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కో ఆర్డినేషన్ నేతలు



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరుతూ గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కో ఆర్డినేషన్ కమిటీ నేతలు డా. సాదు రాజేష్, డా. జూల సత్య, డా. టీ. నాగయ్య తదితరులు కలిసి తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేయడం. దీర్ఘకాలంగా యూనివర్సిటీలలో పనిచేస్తున్న మాకు తగిన న్యాయం చేయాలని గత పది రోజుల నుండి సమ్మెను కొనసాగిస్తున్నామని, అనేక సంవత్సరాల యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా చాలి చాలని వేతనాలతో పనిచేస్తున్నామని తక్షణమే యూజీసీ పే స్కేల్ ను అమలు చేయాలని కోరడం జరిగింది. సీఎం గారు సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు సమాచారం ఇచ్చి తొందరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినారు.

## ఉదారత చాటుకున్న మంత్రి పొంగులేటి

**బాలిక చదువుకు ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి**



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్ లో భూభారతి చట్టం-2025 అవగాహన కార్యక్రమంలో పాల్గొనడానికి వేదిక వద్దకు చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్కడే ఒక వృద్ధురాలు కాగితం చేతిలో పట్టుకొని దీన స్థితి లో ఏదో అవసరం కోసం వేచి చూస్తున్నట్లుగా ఉండడాన్ని గమనించిన మంత్రి స్వయంగా వేదిక పై నుండి నిలబడి ఆ వృద్ధురాలిని వేదిక మీదకు ఆప్యాయం గా పిలిచి ఇక్కడికి ఎందుకు వచ్చావు అమ్మా.. అని సమస్యను గురించి ఆరా తీయగా.. ఆ వృద్ధురాలు బదులిస్తూ తన పేరు వేల్పుల ఊర్మిళ అని 41 వ డివిజన్ శంభునిపేటలో తన నివాసమని, తన మనవరాలు వేల్పుల లిటి ఇటీవల 4వ తరగతి పూర్తి చేసుకుని సెయింట్ గాబ్రియల్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాసి సీటు సాధించడం జరిగిందని, కానీ లిటి తల్లిదండ్రులు మనస్పర్ధల వల్ల వేరుగా ఉంటున్నారనీ, తన మనవరాలికి సీటు దక్కినప్పటికిని చదివించే స్తోమత తనకు లేదని మంత్రి వద్ద వాపోగా, వెంటనే స్పందించిన మంత్రి చదువు కోవడానికి అయ్యే వ్యయాన్ని భరిస్తానని ప్రకటించి మంత్రి చూపిన ప్రోత్సాహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## పంచాయతీ సిబ్బందికి ఒంటిపూట పని

**ఎండల తీవ్రత నేపథ్యంలో పీఆర్ శాఖ నిర్ణయం**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

పంచాయతీ వర్కర్లకు పంచాయతీరాజ్ శాఖ హాఫ్డే పనిచేసే అవకాశం కల్పించింది. ఎండల తీవ్రత దృష్ట్యా పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లు ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు పనిచేసే వెసులుబాటు కల్పించింది. ఈ సమయంలో పంచాయతీకి సంబంధించిన పని పూర్తికాకపోతే అవసరమైతే సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు పనిచేయవచ్చని పీఆర్శాఖ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నది.

## ఒక్క నిమిషం ఆలస్యమైందని ఈఏపీసెట్ పరీక్షకు అనుమతించని యాజమాన్యం

**కాళ్ల మీద పడి వేడుకున్నా కనికరించని నిర్వాహకులు**

**జనగామ జిల్లా జై భీమ్ న్యూస్**



స్టేషన్ ఘనపూర్ కు చెందిన స్పందన అనే అమ్మాయి టీజీ ఈఏపీసెట్ పరీక్ష రాసేందుకు శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి వచ్చింది. మధ్యాహ్నం 3 గంటలకు పరీక్షా కేంద్రం వద్దకు రావాల్సి ఉండగా, 3:01 గంటలకు (ఒక్క నిమిషం ఆలస్యం ) వచ్చింది, దీంతో ఒక్క నిమిషం ఆలస్యమైందని అధికారులు ఆమెను పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. కాలేజీ అడ్రస్ సరిగ్గా తెలియక, ఇతరులను అడుగుతూ వచ్చేసరికి ఆలస్యం అయిందని, గేటు లోపలికి సరైన సమయానికే వచ్చినప్పటికీ అబ్జర్వర్ ఒక్క నిమిషం లేటుగా వచ్చారు అని అనుమతి ఇవ్వలేదంటూ కన్నీరు పెట్టుకున్న విద్యార్థిని.. తన కూతురి సంవత్సరకాలం వృధా అవుతుందని ఆవేదన వ్యక్తం చేసిన స్పందన తండ్రి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# పెగాసస్ వ్యవహారంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

**దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పేంటని ప్రశ్న**
**పహల్గాం దాడులతో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు**
**పెగాసస్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం వెల్లడి**

**న్యూఢిల్లీ,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్) :**

దాదాపు నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం పై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పు లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే,అది ఎలా,ఎవరిపై ఉపయోగిం చారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ.. వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా పిటిషన్ తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని, ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముంది. అయితే, దాన్ని ఎవరిపైన ఉపయోగిస్తున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. పౌర సమాజంపై కాకుండా.. దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదు. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. ఉగ్రవాదులు గోప్యత హక్కును కోరకూడదు. అయితే, సామాన్య పౌరుల గోప్యతకు మేం తప్పకుండా రక్షణ కల్పిస్తామని స్పష్టంచేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్‌ఎస్‌వో గ్రూప్ అనే సంస్థ 'పెగాసస్' స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్‌ఎస్‌వో పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు విక్రయిస్తుంటు-ంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు- పేర్కొంది. వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నట్లు- తెలిపింది. దీంతో ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీం.. ముగ్గురు సభ్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ- నివేదిక రూపొందించింది.

# బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

**కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలో అవినీతి ప్రస్తావన లేదు**
**ఉత్తమ్ వ్యాఖ్యలను ఖండించిన మాజీమంత్రి హరీష రావు**

**హైదరాబాద్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టు-కుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.



# పూలే అంబేద్కర్ స్ఫూర్తితో మనువాదాన్ని ప్రతిఘటించండి

**రాజ్యాంగేతర శక్తులు రాజ్యమేలుతున్నాయి**
**కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**



మహాత్మా జ్యోతిబాపూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లు తుది శ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించారని వారే మన ఆధునిక భారతావని నిర్మాతలని వారు చూపిన మార్గములో నేటితరం మనువాదంపై మహోద్యమం చేపట్టాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం హన్మకొండ టీఎస్ యుటిఎఫ్ భవన్ లో కేవిపిఎస్ ఆధ్వర్యంలో పూలే అంబేద్కర్ జన జాతర సభ నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ పూలే అంబేద్కర్ లాంటి మహనీయులను భారత దేశంలో ఒక కులానికి పరిమితం చేయటం ద్వారా వారిని అవమానిస్తున్నారని ఆధునిక భారతానికి నిర్మాతలు అనే విషయాన్ని నేటితరం మర్చిపోతుందన్నారు. వేల సంవత్సరాల మనుస్మృతి శూద్రులకు విద్యను నిషేధిస్తే, పూలే దంపతులు అందరికీ విద్య కోసం తుది శ్వాస వరకు కృషి చెప్పారు మహిళా సమానత్వం కోసం నాటి ఆటవిక సమాజాన్ని నాగరిక సమాజంగా మార్చారని కొనియాడారు. మనువాద సంస్కృతిపై పూలే నడిపిన ఉద్యమాలు సంస్కరణలు భారతదేశం నేటి స్థితికి చేరిందన్నారు. మెజారిటీ ప్రజల కోసం నాడు పూలే నడిపిన ఉద్యమాలు ముఖ్య భూమిక పోషించాయన్నారు. వితంతువులకు శరణాలయాలు శూద్రులు అస్పృశ్యులకు పాఠశాల నెలకొల్పడం వంటి కార్యక్రమాలతో పాటు సత్యశోధకు సమాజ్ ను స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారని చెప్పారు ఆయన అందరికీ విద్య కోసం కృషి చేస్తే నేటి మనువాద పాలకులు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కాసులు ఉన్న కొందరికి కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని అట్టడుగు వర్గాలకు నూతన జాతీయ విద్యా విధానంతో రిజర్వేషన్స్ లేకుండా చేశారన్నారు పూలే ఆశయాలకు విరోధిగా కేంద్ర బిజెపి సర్కార్ పని చేస్తుందన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కొలుస్తూ ఆయన అధ్యయన లోతులను విస్మరిస్తున్నారని చెప్పారు భూమి జాతీయకరణ జరగాలని పరిశ్రమలలో కార్మికులకు యాజమాన్య వాటా హక్కు ఉండాలని నాడే ఆయన రాష్ట్రాలు మైనార్టీలు అనే పుస్తకంలో ప్రస్తావించారని చెప్పారు మహిళా సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లు తీసుకొచ్చి నాటి ప్రభుత్వం అంగీకరించకపోతే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర బీజేపీ సర్కార్ విధానాల వల్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో పౌరులందరికీ హక్కులు కల్పించిన రాజ్యాంగమే కనుమరుగ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశాన్ని మతరాజ్యంగా మార్చే కుట్రలు చేస్తున్నారని దీంతో అట్టడుగు వర్గాలకు ఈపాటి హక్కులు ఉండవన్నారు భారత రాజ్యాంగం భారతదేశ ప్రజలందరికీ గుండెకాయ లాంటిదని దాన్ని రక్షించుకోవడం నేటి తరం కర్తవ్యం కావాలన్నారు ప్రైవేట్ రంగం 85% శాతానికి పెరిగిందని అందులో రిజర్వేషన్స్ లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధమన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం మహా ఉద్యమం జరగాలన్నారు. పూలే అంబేద్కర్ పుట్టిన ఏప్రిల్ నెలలను కేవీపీఎస్ మహనీయుల మాసంగా పాటి స్తుందన్నారు కుల వివక్ష అంటరానితనంపై పూలే అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం దశరథ్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి ప్రభాకర్ రెడ్డి బొట్ల చక్రపాణి మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్ కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ జిల్లా నాయకులు ముదుసు నారాయణ, జి అశోక్, దానబోయిన రాంబాబు, గాదె రమేష్, జిల్లా కమిటీ సభ్యులు సుకర్ణ రెనుకుంట్ల చందర్, కొడేపాక సదయ్య, వేల్పుల రవి, వేలు సుమన్, కుమ్మరి రవీందర్, కుమారస్వామి, లతీఫ్, మల్లయ్య, యాకయ్య, విజయ, సుభద్ర, మమత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె సైరన్.. మే 7 నుంచి బస్సులు బంద్

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణలో సమ్మె సైరన్ మోగింది. మే 7 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న ప్రకటించారు. ఆర్టీసీ సమ్మె పై నారాయణగూడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన కార్మిక సంఘాలు సమ్మె వాల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న... మే డే స్ఫూర్తితో ఆర్టీసీ సమ్మెకు సిద్దమైనం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల నివారణకు చర్యలు చేపట్టాలి. మా న్యాయమైన డిమాండ్ ల పై స్పందించాలి. సమ్మెకు ముందు ఆర్టీసీ కార్మికులు మే5 న కార్మిక కవాతు చేపడుతున్నాం. ఆర్టిసి కళ్యాణ మండపం నుంచి బస్సు భవన్ వరకు సమ్మెకు మద్దతుగా ఆర్టీసీ యూనిఫారంలో కవాతు ఉంటుంది. మే 7 నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మె కు వెళ్ళబోతున్నం. కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జెఏసిలోకి వస్తామని, మళ్లీ యాజమాన్యాలకు మద్దతుగా మాతో కలవడం లేదు . యూనియన్ లకు అతీతంగా అందరు సమ్మెకు కలిసి రావాలి. సీఎం త్వరగా ఆర్టీసీ విలీనాన్ని చేపట్టాలి. ఆర్టీసీలో ప్రజాపాలన చేయాలని కోరుతున్నాం. ప్రైవేటీకరణకు మూలమైన ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం కొని నడపాలి. 2021 వేతన సవరణ చేయాలి, పెండింగ్ బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా ఆర్టీసి కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వంలో ఆర్టిసి విలీన ప్రక్రియ చేపట్టాలి. 16 వేల మంది రిటైర్ అయిన ఖాళీలను భర్తీ చేయాలి. సీఎం వెంటనే ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పై తమ వైఖరి తెలపాలి అని డిమాండ్ చేశారు.


**సమ్మె ఆగదు: ఆర్టీసీ జెఏసి వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి**

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మే 7 న సమ్మె కు వెళు తున్నాం. ఇప్పటికే లేబర్ కమిషన్ కు సమ్మె పై లేటర్ ఇచ్చాం. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే 7వ తేది నుంచి సమ్మె జరుగుతుంది. సీఎం ఆర్టీసీ పై మీ వైఖరి చెప్పండి, మా సమస్యలను పరిష్కరించండి. చిత్త శుద్ధి ఉంటే మిగతా అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలి . ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు, ప్రై వెట్ బస్సులను నడపొద్దు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టిసి ఉద్యోగులకిచ్చిన హామీల సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలి. సంస్థలో పారిశ్రామిక అశాంతి కలగకుండా చూడాలని జేఏసీకోరుతోంది.

# ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

**సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ**
**భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం**
**ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోడీ విస్పష్ట ప్రకటన**

**న్యూఢిల్లీ,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**



ఉగ్రవాదాన్ని అణిచివేసే విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ నిర్వహణ, సమయం, తేదీ, టార్గెట్‌లను సైన్యమే నిర్ణయిస్తుందని, భారత దళాల సామర్థంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది. పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు దారుణ మారణహోమానికి పాల్పడి వారం రోజులు పూర్తయింది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. ఈ దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు దృఢచిత్తంతో ఉన్నమని ప్రధాని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడం జాతీయ సంకల్పం అని ఆయన అన్నారు. సాయుధ దళాల సామర్థంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. తీవ్రవాదం అణిచివేయడంలో, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవడంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ పూర్తిగా సైన్యానిదే అని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన ఈ సమావేశం దాదాపు గంటన్నరపాటు- కొనసాగింది. ఈ సమావేశంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ పాటు- వివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు- తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ- కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు- రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీ-లు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు- చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

**కేంద్రం నివేదకను తప్పపట్టడం దుర్మార్గం**
**సొంత నిర్ణయాలతో లక్షకోట్లు నీటిపాటుచేశారు**
**అయినా సిగ్గూఎగ్గు లేకుండా మాట్లాడితే ఎలా**
**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కావాలని ఎదురుదాడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇంతపెద్ద కుంభకోణం జరిగి లక్షకోట్లు నీటి పాలైతే దానిమీద వారికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. 'ఎన్డీఎస్ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమిషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే..ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందని అన్నారు. వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఇంతకన్నా సిగ్గుచేటు మరోటి ఉండదన్నారు. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్డీఎస్ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు- చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని ఉత్తమ్ మండిపడ్డారు. వజ్రోత్సవ సభలో ఏదేదో మాట్లాడిని కెసిఆర్ దీనిపై ఎందుకు నోరు మెదపలేదన్నారు. ఎన్డీఎస్ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ అత్యున్నత బోర్డు. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మిడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్డీఎస్ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. ఇవన్నీ మరచి బిఆర్ఎస్ నేతలు మాట్లాడడానికి సిగ్గుండాలని అన్నారు.

## ఉగ్రదాడితో వణుకుతంటే దిగజారుడు వ్యాఖ్యలా

**కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ వ్యాఖ్యలపై ఆగ్రహం**
**మా ఉద్వేగాలతో ఆడుకోవద్దన్న సంతోష్ జగదలే సతీమణి**

**పుణె,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

పహల్గాం ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సంతోష్ జగ్‌దలే సతీమణి ప్రగతి జగ్‌దలే నేతలకు ఓ విజ్ఞప్తి చేశారు. ఈ దాడిని రాజకీయం చేయొద్దని, తమ ఉద్వేగాలతో ఆడుకోవద్దని కోరారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె తీవ్రంగా స్పందించారు. ఓవైపు ఉగ్రవాదులు మతం పేరు చెప్పి కాలుస్తుంటే...ఇలాంటి వ్యాఖ్యలతో మమ్మలను అవమానించవద్దని కోరింది. ఉగ్రవాదులకు కులం, మతం లేదని వాడెట్టివార్ చేసిన వ్యాఖ్యలపై ఆమె అభ్యంతరం తెలిపారు. పర్యాటకులను కాల్చేముందు వారి మతం గురించి అడిగారంటున్న వాదనపైనా వాడెట్టివార్ అనుమానం వ్యక్తంచేశారు. ఆ నేత వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ క్రమంలోనే ప్రగతి పుణెలో మీడియాతో మాట్లాడారు. ఇప్పటికీ ఆ ఉగ్రదాడి భయం మమ్మల్ని వీడలేదు. నేను కళ్లు మూసుకున్నప్పుల్లా.. రైఫిల్ పట్టుకున్న వ్యక్తి కనిపిస్తాడు. ఉగ్రవాదాన్ని దగ్గరి నుంచి చూశాం. విద్వేషపూరిత మాటలు విన్నాం. సరిగా నిద్రపోయి ఎన్నిరోజులైందో. ఈ ఘటనను రాజకీయం చేయొద్దు. మా ఉద్వేగాలతో ఆడుకోవద్దని నేతలందరినీ కోరుతున్నానని ఆమె అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఆ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో మహారాష్ట్రకు చెందిన సంతోష్ జగ్‌దలే ఒకరు. ఇదిలా ఉంటే.. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్కో కుటు-ంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు- ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని క్యాబినెట్ సమావేశం అనంతరం వెల్లడించారు.

## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

**రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం**
**భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి**

**వరంగల్,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్) :**

దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి నిలుస్తుందని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ చట్టం రైతులకు శ్రీరామరక్ష అని అన్నారు.భూ భారతి 2025 చట్టంపై మంగళవారం వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ ప్రారంభానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం భూ భారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించి అందులోని అంశాలను జిల్లా కలెక్టర్ వివరించారు.అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణి వల్ల రైతుల వారసత్వంగా వచ్చే భూమిని అనుభవించలేక అనేక సమస్యలు ఏర్పడ్డాయని, వాటి చిక్కుముడి విప్పడానికే భూ భారతి దోహదపడుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచల వ్యవస్థను తీసుకువచ్చినట్లు- తెలిపారు. సభలో రైతులు కొంగరి భాస్కరరావు, విజయ్ కుమార్, గోపాల రాధాకృష్ణ సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ప్రజలకు అందినప్పుడు దానికి సార్ధకత చేకూరుతుందని, అందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూముల సర్వే, మ్యాప్ తయారీ , పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిజాయితీగా పనిచేయాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వరంగల్ నగర పరిధిలోని 32వ డివిజన్ బిఆర్‌నగర్‌లో మంగళవారం సన్నబియ్యం లబ్ధిదారుడు సింగబోయిన అనిల్ కుమార్ ఎల్లమ్మ ఇంట్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంఎల్ఏ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని థానాజీ వాకడే భోజనం చేశారు. లబ్ధిదారులు అందించిన ఆతిథ్యానికి ముగ్ధులైన మంత్రులు అన్నదాత సుఖీభవ అంటూ కుటుంబ సభ్యులను శాలువతో సత్కరించి, నజరానా అందజేశారు.

## చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

**చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతాకాదు**
**జిల్లా పార్టీలో మీరే సర్వస్వం..గెలుపు బాధ్యతా మీదే**
**పార్టీ జిల్లా అధ్యక్షులతో భేటీలో జగన్ దిశానిర్దేశం**

**అమరావతి,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

జిల్లాల్లో మీరే సర్వం.. మీరే పార్టీ.. పార్టీయే మీరు.. అని వైకాపా అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ అన్నారు.అంతే కాదు జిల్లాల్లో అన్నిస్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత కూడా మీదే అంటూ జిల్లా అధ్యక్షులపై కీలక బాధ్యతలు మోపారు. వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన జగన్.. పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తూ.. కీలక సూచనలు చేశారు.. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.. రెడ్ బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలవుతోంది.. చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతాకాదు.. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్నిరంగాల్లోనూ విధ్వంసమే.. విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది.. మద్దతు ధరలు దొరక్క రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వివిధ జిల్లాల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు.. అయితే, రైతుల తరఫున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.. ఆ మేరకు జిల్లాల్లో రైతులకు అండగా ఉండాలి.. రైతుల డిమాండ్లపై పోరాటం చేయాలి. వీటిని ప్రజల్లోకి బాగా తీసుకువెళ్లాలి అని సూచించారు.. సాధారణంగా రెండు, మూడు సంవత్సరాలు అయితే కానీ.. ప్రభుత్వంపై వ్యతిరేకత బయటకు కనిపించదు.. కానీ, ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంమీద వ్యతిరేకత తీవ్రంగా వచ్చిందన్నారు వైఎస్ జగన్.. అందుకే యుద్ధ ప్రాతిపదికన కమిటీ- నిర్మాణం పూర్తిచేయాలి.. దీని తర్వాత పార్టీ పరంగా మీకూ, నాకూ పూర్తిగా పని ఉంటు-ంది. అందరం కలిసికట్టు-గా పార్టీపరంగా కార్యక్రమాలు బలంగా ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.. జిల్లాలో పార్టీ ఓనర్‌షిప్ మీది.. ప్రజా సంబంధిత అంశాల్లో ఒకరి ఆదేశాల కోసం మీరు ఎదురు చూడొద్దు.. మీకు మీరుగా స్వచ్ఛందంగా కదలాలని స్పష్టం చేశారు.. నియోజకవర్గ ఇన్‌ఛార్జితో కలిసి మొదట కదలాల్సిందే మీరే.. ప్రజలకు అండగా మీరు చేస్తున్న కార్యక్రమాల వల్ల అది రాష్ట్రస్థాయి దృష్టిని ఆకర్షిస్తుంది. దీని ద్వారానే మీ పనితీరు బయటపడుతోందన్నారు జగన్.. ఇక, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ మన్ననలు పొందాల్సిన బాధ్యత మీదన్నారు జగన్.. సమాజంలో గొంతులేని వారికి బాసటగా నిలిచేది వైసీపీయే.. ప్రతి సమస్యలోనూ బాధితులకు తోడుగా నిలిచేది వైసీపీయేనన్న జగన్.. మే నెలలోపు మండల కమిటీ-లు పూర్తిచేయాలి.. జూన్-జులైల్లో గ్రామస్థాయి, మున్సిపాల్టీలల్లో డివిజన్ కమిటీ-లు పూర్తిచేయాలి.. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో బూత్ కమిటీ-లు ఏర్పాటు-కావాలి.. జిల్లా స్థాయి నుంచి పార్టీని గ్రామస్థాయి వరకూ తీసుకువెళ్లే బాధ్యతల్లో మీరు ఉన్నారని తెలిపారు.. పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగాలి... జిల్లా అధ్యక్షుల పాత్ర పార్టీలో చాలా కీలకమైనదని.. మీమీ జిల్లాల్లో పార్టీ మీద మీకు పట్టు- ఉండాలన్నారు.. పార్టీ బలోపేతం కోసం గట్టిగా కృషిగా చేయాలి. బాధ్యతల నుంచే అధికారం వస్తుంది. జిల్లాల్లో మీరే సర్వం.. మీరే పార్టీ.. పార్టీయే మీరు. జిల్లాల్లో అన్నిస్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత మీదే.. అదే తలంపుతో పార్టీని నడపాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో గెలిపించే బాధ్యత మీది.. అది మీ ప్రధాన బాధ్యత.. దీనికోసం ఏం చేయాలన్నదానిపై మీరు గట్టిగా పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ప్రతి కమిటీ బలంగా ఉండాలి. ఏదైనా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనితీరు బాగోలేకపోతే పిలిచి చెప్పగలగాలి. అప్పటికీ పనితీరు బాగోలేకపోతే ప్రత్యామ్నాయం చూడ్డంలో మీ భాగస్వామ్యం కీలకం అన్నారు.. పార్టీలో ఇద్దరి మధ్య వివాదం ఉన్నప్పుడు పిలిచి సమన్వయం చేయాల్సిన బాధ్యత మీది. మీ పరిధిలో 7కు ఏడు గెలిపించాల్సిన బాధ్యత మీది. బాధ్యత, అధికారం రెండూ తీసుకోండి. మీరు సమర్థులని భావించి, మీకు ఈ బాధ్యతలు అప్పగించడం జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయం చేయడం, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ కమిటీ- నిర్మాణం మీ ప్రధాన బాధ్యత. అలాగే ప్రజా సంబంధిత అంశాల్లో చురుగ్గా ఉండాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మన నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది. భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ బయటపడుతుంది. అప్పుడే ఆ బ్యాట్స్‌మెన్ ప్రజలకు ఇష్టుడు అవుతాడు. ఇదికూడా అంతే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనం చేసే పనులవల్ల మనం ఎలివేట్ అవుతాం. ప్రజల దగ్గర, పార్టీలోనూ గౌరవం పెరుగుతుంది. ఇమేజీ పెరుగుతుంది. మన పనితీరు వల్లే మనం మన్ననలను పొందగలుగుతామని కీలక సూచనలు చేశారు.

## కర్రెగుట్ట చుట్టూ మందుపాతరలు

**ములుగు,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ఎనిమిది రోజులుగా కేంద్ర బలగాలు కర్రెగుట్ట అడవులను తమ ఆధీనంలోకి తీసుకొని మావోయిస్టుల కోసం అన్వేషిస్తున్నాయి. వేలాది కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను నిరంతరంగా చేపడుతున్నాయి. సుమారు వెయ్యి మంది మావోయిస్టులు కర్రెగుట్టల్లోని సొరంగాలలో ఉన్నారనే సమాచారం మేరకు కూంబింగ్ బలగాలు ఆ దిశగా వేట కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని చత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించారు.



## పహల్గామ్ దాడి అనంతరపరిస్థితులు

**హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతసమీక్ష**

**న్యూఢిల్లీ,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు, భద్రతపై సమీక్షించేందుకు హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ- ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సహస్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీ), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), నేషనల్ సెక్యూరిటీ- గార్డ్ (ఎన్ఎస్‌జీ), అసోం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్స్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు అత్యంత పాశవికంగా 26 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకోవడంతో జమ్మూకశ్మీర్ అంతటా కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లు ఉధృతం చేశారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లు, బలగాల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించేందుకు ఎంహెచ్ఏలో అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాల వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. జమ్మూకశ్మీర్‌లో కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ నడుస్తున్నందున ఈ సమయంలో సున్నితమైన అంశాలను వెల్లడించలేమని అంటున్నారు.

## పాక్ అనుకూల విధానాల్లో కాంగ్రెస్ నేతలు

**కాంగ్రెస్ గాయబ్ పోస్టుపై మండిపడ్డ బిజెపి**

**న్యూఢిల్లీ,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో రెండ్రోజులు సైలెంట్‌గా ఉన్న బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయం మొదలైంది. కాంగ్రెస్ ప్రధాని నరేంద్రమోడీని టార్గెట్ చేస్తూ..అవసరమైన సమయాల్లో మిస్ అవుతారని కామెంట్ చేసింది. ప్రధానిని సూచించే ఒక ఫోటోని పోస్ట్ చేసి, దానికి తల లేకుండా ఉంచింది. గాయబ్ అంటూ కామెంట్ పెట్టింది. దీనిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్‌ని టార్గెట్ చేస్తూ బీజేపీ నేతలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. అఖిల పక్ష సమావేశానికి ప్రధాని మోడీ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఎత్తిచూపారు. కాంగ్రెస్ నేతల కామెంట్స్‌పై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్‌తో కుమ్మక్కైందని, రాహుల్ గాంధీ రహస్య వ్యూహాల మేరకు ఇలా చేస్తున్నారని అన్నారు. గతంలో ప్రధాని మోడీ చేసిన రక్తం నీరు కలిసి ప్రవహించలేదనే వ్యాఖ్యల్ని ఠాకూర్ గుర్తు చేశారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పాకిస్తాన్ భాష మాట్లాడటం, పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం నాకు అర్థం కాదు. భారతీయుల్ని చంపినప్పుడు వారి రక్తం మరగదా.. ప్రతీకారం తీర్చుకోవాలని అనిపించదా..ని ప్రశ్నించారు. తన ముస్లిం ఓటు బ్యాంక్ కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బీజేపీ నేత అమిత్ మాల్వియా ఆరోపించారు. కాంగ్రెస్ ఇలా చేయడం ఇదే మొదటిసారి కాదని చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. పాకిస్తాన్ నుంచి కాంగ్రెస్‌కి ఆదేశాలు వస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టుని పాకిస్తాన్ రాజకీయ నాయకుడు వాడుకున్నాడని అన్నారు.

## అమరావతిలో ప్రధాని పర్యటన

**ఏర్పాట్లపై పోలీసులతో హోంమంత్రి ఆరా**

**అమరావతి,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్):**

అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి మే 2న ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. ప్రధాని రాక సందర్భంగా ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తోంది. ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించగా.. తాజాగా హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని పర్యటన దృష్ట్యా కట్టు-దిట్టమైన భద్రత ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని రాక సందర్భంగా 6 వేల మందితో భద్రత ఏర్పాటు- చేసినట్లు మంత్రి అనిత చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజా వేదిక కూల్చివేత నుంచి విధ్వంస పాలన చేశారు. కానీ సీఎం చంద్రబాబు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. అమరావతి కోసం రైతులు ఎన్నో త్యాగాలు చేశారు. అమరావతి కోసం గతంలో బస్ యాత్ర చేస్తే రాళ్ళ దాడి చేశారు. అమరావతిని మళ్లీ ప్రారంభించడం వెనక ఎంతో ఆవేదన శ్రమ ఉన్నాయి. రైతుల న్యాయ పోరాటం సహా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ గార్ల కృషి వల్ల అమరావతి పనులు రీ లాంచ్ అవుతున్నాయి. ఏపీలో ఒక పండగ వాతావరణంలో రాజధాని రీ లాంచ్ కార్యక్రమం జరుగుతోంది' అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

## కృష్ణారెడ్డి పట్టుదలకు హ్యాట్సాఫ్

**చంద్రబాబు ప్రశంసలు**

**అమరావతి,ఏప్రిల్29(జై భీమ్ న్యూస్) :**

కానిస్టేబుల్ ఉదయ కృష్ణారెడ్డి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆల్ ఇండియా 350 ర్యాంక్ సాధించిన సంగతి తెలిసిందే. ఆయన ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఉదయ కృష్ణారెడ్డి సక్సెస్ స్టోరీపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఉదయ కృష్ణారెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించారు. ' కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌గా ఎదిగిన ఉదయ కృష్ణారెడ్డి ప్రయాణం.. ధైర్యం, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది. సాధించాలనే పట్టు-దల ప్రతీ అడ్డంకిని బద్దలు కొడుతుంది. కొత్త చరిత్రను రాస్తుంది. భవిష్యత్తు పట్టు- వదలకుండా పని చేసే వారిదే ' అని పేర్కొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా



# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్

**2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన**




ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రుర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగస్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వారం క్రితం యంగ్ టైగర్ ఈ సినిమా సెట్స్ లో పాల్గొన్నారు.

# చిత్రదర్శకురాలుకు అరుదైన గౌరవం

**ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీలో కపాడియాకు చోటు**

భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్-మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు.

గతేడాది దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాయల్ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా కేన్స్‌లో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ చలనచిత్రోత్సవం మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరగనుంది.





# గురునానక్ పాత్రలో అమీర్ ఖాన్ పోస్టర్

**అది నకిలీదంటూ టీమ్ స్పష్టీకరణ**

బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్.. సిక్కు మతస్థుల దైవం అయిన గురునానక్ బయోపిక్ చేస్తున్నట్లు అతడి రూపంలో ఉన్న ఒక పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.. తాజాగా ఈ వార్తలపై అమీర్ ఖాన్ టీమ్ స్పందించింది. ఆ పోస్టర్ పూర్తిగా నకిలీదని, అది కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించిన పోస్టరని టీమ్ చెప్పుకోచ్చింది. ఈ విషయంపై అమీర్ ఖాన్ టీం స్పందిస్తూ.. గురునానక్‌గా అమీర్ ఖాన్‌ను చూపిస్తున్న పోస్టర్ పూర్తిగా నకిలీది. దానిని ఎఐ ద్వారా తయారు చేశారు. అమీర్ ఖాన్‌కు అలాంటి ప్రాజెక్ట్‌తో ఎలాంటి సంబంధం లేదు. ఆయన గురునానక్‌ను ఎంతో గౌరవిస్తారు. ఎలాంటి అగౌరవకరమైన చర్యలకు ఆయన మద్దతు ఇవ్వరు. దయచేసి ఇలాంటి నకిలీ వార్తలను నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ పోస్టర్‌ను ఒక నకిలీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా వ్యాప్తి చేయడంతో సిక్కు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ ఘటనపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీకి కూడా ఫిర్యాదు అందింది. ఇది మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ ఈ మోసాన్ని వెంటనే బహిరంగంగా ఖండించాలని, తమకు దీనితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది.

# హీరోల కోసం త్రివిక్రమ్ చూపు వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళకళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.

# వరుణ్ తేజ్..మేర్లపాక కాంబోలో మూవీ

బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వలని భావిస్తున్నాడు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ తైక్వాండో లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. వరుణ్ తేజ్ కెరీర్ లో 15వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి వరుణ్ ఆశను మేర్లపాక గాంధీ నెరవేరుస్తాడో లేదో రానున్న రోజుల్లో తెలుస్తుంది.



# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్  చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి.  ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్  2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి ధండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. డేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరీ ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.

